స్టాంప్ పేపర్ల షాటేజీ

- కొరత కొనసాగితే.. అధిక ధరలకు విక్రయాలు

తిమ్మాపూర్, సెప్టెంబర్ 3: భూ క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు, ఇతర ఒప్పందాలు కావాల్సిన నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు తిమ్మాపూర్‌లోని కరీంనగర్ రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో సరిపడా దొరకడం లేదు. కొద్ది రోజులుగా అధికారులు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి తెప్పించి, స్టాంప్ వెండర్లకు విక్రయించకపోవడంతో కొరత ఏర్పడుతున్నది.

తిమ్మాపూర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోకి తిమ్మాపూర్, మానకొండూర్, చిగురుమామిడి, గన్నేరువరం మండలాలు వస్తాయి. ఆయా మండలాల్లో మండలానికి జనాభా ప్రాతిపదికన 3నుండి5మంది స్టాంప్ వెండర్లు ఉంటారు. వీరు తిమ్మాపూర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి రూ.100,రూ.50, రూ.20 నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు కొనుగోలు చేసి వారి,వారి మండలాల్లో స్టాంప్ వెండర్లు విక్రయిస్తారు.

కొరతతో వినియోగదారుల ఇబ్బందులు

దాదాపు నెల రోజుల నుంచి తిమ్మాపూర్‌లోని కరీంనగర్ రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంప్ వెండర్లు కొనుగోలు చేసేందుకు రూ.వంద స్టాంప్ పేపర్లు అందుబాటులో ఉండడం లేదు. దీంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. క్రయ, విక్రయదారులు, ఇతర అవసరాలున్నవారు 50, 20పేపర్లతో సరిపెట్టుకుంటుండగా.. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. కొంత మంది స్టాంప్ వెండర్లు ముందు చూపుతో గతంలోనే కొనుగోలు చేసిపెట్టుకున్నవారు ఇంకా విక్రయించుకుంటున్నారు. కొరత ఇలానే కొనసాగితే బాండ్‌పేపర్లు ఉన్నవారు అధికమొత్తం వసూలు చేసే అవకాశం ఉంది. అధికారులు స్పందించి అన్ని రకాల బాండ్‌పేపర్లు అందుబాటులో ఉంచాలని వినియోగదారులు, స్టాంప్ వెండర్లు కోరుతున్నారు. దీనిపై సబ్‌రిజిస్ట్రార్ పార్థసారథిని వివరణ కోరగా.. రెండు,మూడు రోజుల్లో తెప్పిస్తామని చెప్పారు.

విద్యార్థులు నిత్యం కళాశాలకు హాజరుకావాలి

- తరగతులు వింటే ఉత్తమ ఫలితాలు
- ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహం సందర్శనలో కలెక్టర్ పమేలా సత్పతి

సుభాష్‌నగర్‌లోని ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, సెప్టెంబర్ 3: వసతిగృహాల విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు వెళ్లి, తరగతులకు హాజరుకావాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. నగరంలోని సుభాష్‌నగర్‌లో గల ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహాన్ని ఆమె మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో ఉన్న విద్యార్థినులతో ఆమె మాట్లాడారు. విద్యార్థులంతా నిత్యం కళాశాలకు హాజరై తరగతులు వింటే, ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. కారణం లేకుండా కళాశాలకు వెళ్లకుండా హాస్టల్‌లో ఉండరాదని, అలాగే సెలవులు కూడా మంజూరు చేయరాదని సంక్షేమ అధికారులను ఆదేశించారు. హాస్టల్‌లో కల్పిస్తున్న వసతి సౌకర్యాలపై విద్యార్థినులనడిగి తెలుసుకున్నారు. కళాశాలకు హాజరవుతున్న విద్యార్థుల వివరాలను వార్డెన్లు రోజువారీగా నమోదు చేయాలన్నారు. వసతి గృహంలో ఖాళీగా ఉన్న భవనాలు పరిశీలించిన కలెక్టర్, వాటికి అవసరమైన మరమ్మతులు చేయించి, ప్రభుత్వావసరాలకు వినియోగించాలన్నారు. వినియోగంలో లేని శుద్ధజల ప్లాంటును పరిశీలించి, వారంలోగా మరమ్మతులు చేయించి విద్యార్థినులకు శుద్ధ జలం అందించాలని ఆదేశించారు. ఆమె వెంట ఎస్సీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగలేశ్వర్ ఉన్నారు.

చామనపల్లి పీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 3: చామనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. కేంద్రంలో ఆరోగ్య మహిళా కార్యక్రమంలో ఇప్పటి వరకు పరీక్షలు చేసుకున్న మహిళల వివరాల రిజిస్టర్‌ను పరిశీలించారు. వైద్య సేవలు, ఆరోగ్య సేవా కార్యక్రమాల అమలుపై రోగులు, ప్రజలను ఆరా తీశారు. ఫార్మసీలో అందజేస్తున్న మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ల్యాబ్‌లో వైద్య సిబ్బందితో హిమోగ్లోబిన్ పరీక్ష చేయించుకున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి థైరాయిడ్ మాత్రలను అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుజాత, వైద్యుడు మనోహర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన రోడ్డు మరమ్మతులు: ఎమ్మెల్యే సత్యం

గంగాధర, సెప్టెంబర్ 3 : చొప్పదండి నియోజకవర్గంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని నాగిరెడ్డిపూర్, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. ప్రతి యేడు వర్షాలకు నాగిరెడ్డిపూర్ వద్ద కల్వర్టు కొట్టుకుపోతున్నదని, శాశ్వత పరిష్కారం కోసం బ్రిడ్జి నిర్మాణం చేస్తామన్నారు. లక్ష్మీదేవిపల్లి వద్ద బ్రిడ్జి నిర్మాణానికి పనులు ప్రారంభం కాకపోవడానికి కారణాలను తెలుసుకుని, సాంకేతిక లోపాలను సరిచేసి నిర్మాణ పనులను ప్రారంభిస్తామన్నారు. ఇక్కడ మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజితాశ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పంజాల ఆంజనేయులు, ఆకుల అంజయ్య, గుజ్జుల బాపురెడ్డి, పడాల రాజన్న, ముద్దం నగేశ్ తదితరులు ఉన్నారు.

గుండి వంతెనను పరిశీలించిన ఎమ్మెల్యే మేడిపల్లి

రామడుగు, సెప్టెంబర్ 3: శిథిలావస్థకు చేరిన గుండి వంతెనను మంగళవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరిశీలించారు. వంతెన ఎప్పుడు కూలిపోతుందోనని ప్రజలు ఆందోళన చెందుతుండడంతో స్థానిక మాజీ ఎంపీటీసీ మడ్డి శ్యాంసుందర్ ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గుండికి వచ్చిన ఆయన అలుగు ద్వారా వెళ్లే వరద నీరు ముంచెత్తే గుండి –దేశాయిపేట దారిని పరిశీలించారు. ఇక్కడ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

పంటల నమోదును పరిశీలించిన డీపీవో

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 3: చేగుర్తి గ్రామంలో పంటల నమోదు కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి ఏడీఏ రణాధీర్‌తో కలిసి పరిశీలించారు. గ్రామంలో రైతులు వేసిన పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ కార్యాలయంలో పాము కలకలం

శంకరపట్నం, సెప్టెంబర్ 3: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం పాము కలకలం సృష్టించింది. సాయంత్రం పూట రికార్డ్ అసిస్టెంట్ అనిల్ తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డ్ గదిలోకి వెళ్లారు. ఈ సమయంలో ఆయనకు ఓ పాము కనిపించడంతో ఒక్కసారిగా భయాందోళనకు గురై బయటకు పరుగెత్తుకు రాగా, కార్యాలయంలోని ఇతర సిబ్బంది సైతం భయపడిపోయారు. అనంతరం అధికారులు పాములు పట్టే వ్యక్తిని పిలిపించారు. అయితే అతను గంట పాటు వెదికినా గదిలో పాము ఆచూకీ కనిపించలేదు. రికార్డులు, ఫైళ్ల మధ్య దాగి ఉంటుందని అనుకుంటున్నారు. అప్పటికే పొద్దు పోవడంతో ప్రయత్నాన్ని విరమించారు.

అన్నదాతలు ఆధునికతను అందిపుచ్చుకోవాలి

- పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త మంజులత

సమావేశంలో మాట్లాడుతున్న పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త మంజులత

ముకరంపుర, సెప్టెంబర్ 3: ఆధునిక సాగు విధానాలను అందిపుచ్చుకోవాలని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త మంజులత రైతులకు సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విద్యాలయం 10వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం కరీంనగర్‌లోని వ్యవసాయ పరిశోధన స్థానంలో రైతు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ జీ మంజులత మాట్లాడుతూ, వ్యవసాయ విశ్వవిద్యాలయం ముఖ్య ఉద్దేశాలు, ప్రాముఖ్యతను, రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమాన్ని రైతులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు విజయభాస్కర్ వివిధ పంటల్లో తెగుళ్ల నివారణ, మధుకర్ రావు వరిలో యాజమాన్య పద్ధతులు, తడిపొడి పద్ధతి, ఉషారాణి వివిధ పంటల్లో విశ్వవిద్యాలయం రూపొందించిన నూతన వంగడాల గురించి వివరించారు. ఏరువాక కేంద్రం సమన్వయకర్త కే మదన్ మోహన్ రెడ్డి ప్రస్తుత పరిస్థితుల్లో వివిధ పంటల్లో చేపట్టాల్సిన చర్యల గురించి తెలియజేశారు. మరో శాస్త్రవేత్త రాజేంద్రప్రసాద్ పంటల్లో పురుగుల యాజమాన్యం గురించి వివరించారు. వెద జల్లే పద్ధతిలో 15ఎకరాలు స్వయంగా వరి సాగు చేయడంతో పాటు తోటి రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహిస్తున్న పొత్తూరుకు చెందిన చెరుకు రవీందర్ రెడ్డిని సత్కరించారు. జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, రైతులకు తమ శాఖ ద్వారా సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏడీ రణధీర్ రెడ్డి, సిరిసిల్ల రావెప్ విద్యార్థులు, వ్యవసాయ పరిశోధన స్థానం సిబ్బంది, కరీంనగర్, రాజన్న సిరిసిల్లలోని కొండాపూర్, బద్దిపల్లి, చింతకుంట, పొత్తూరు, నాగులమల్యాల నుంచి రైతులు పాల్గొన్నారు.

శివ చాలీసా పారాయణం

చొప్పదండి, సెప్టెంబర్ 3: శ్రావణమాసం ముగింపు అమావాస్య సందర్భంగా పట్టణంలోని శివకేశవ (శంభుస్వామి) ఆలయంలో సాయి మహిళా సేవా సమితి ప్రధాన సభ్యురాలు దండె లావణ్య ఆధ్వర్యంలో శివచాలీసా, లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఆలయంలో చాలీసా పారాయణం చేసిన మహిళా సేవాసమితి సభ్యులను ఆలయ అర్చకుడు జనగామ సత్యనారాయణ, సాయిబాబా ఆలయ చైర్మన్ గుర్రం హన్మంతరెడ్డి, దండె లింగన్న, దూస రాము, దూస లక్ష్మీ నర్సయ్య అభినందించారు.

12వ తేదీలోగా ఫీజు చెల్లించాలి

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 3: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో బీఫార్మసీ, ఎంఫార్మసీ విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీ ఫార్మసీ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, బీఫార్మసీ ఒకటి, మూడు, ఐదో సెమిస్టర్, ఎంఫార్మసీ రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షల ఫీజు ఈనెల 12వ తేదీలోగా చెల్లించాలని సూచించారు. అపరాధ రుసుము రూ. 300తో ఈనెల 18వ తేదీలోగా చెల్లించాలని సూచించారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

హుజూరాబాద్ టౌన్, సెప్టెంబర్ 3: ప్రమోషన్స్‌లో రూల్ ఆఫ్ రిజర్వేషన్లకు బదులుగా మెరిట్ కమ్ సీనియార్టీని విద్యుత్ శాఖలో అవలంబిస్తున్నారని విద్యుత్ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు మంగళవారం పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల నిబంధనలు పాటించకపోవడం వల్ల ఉద్యోగులకు అపార నష్టం కలుగుతున్నదని తెలిపారు. కార్యక్రమంలో కుమారస్వామి, యాదగిరి, నర్సయ్య, శ్రీనివాస్, శ్రీరామ్, శ్రీధర్, సంపత్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్లపై పశువులను తిరుగనివ్వొద్దు: కమిషనర్

కార్పొరేషన్, సెప్టెంబర్ 3: నగర పాలక సంస్థ పరిధిలోని ఆవులు, గేదెల యజమానులు తమ పశువులను రోడ్లపై తిరుగనివ్వొద్దని, వాటిని పాకల్లోనే ఉంచుకోవాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రోడ్లపై పశువుల సంచారంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నేటి నుంచి రోడ్లు, వీధుల్లో సంచరించే పశువులను బల్దియా సిబ్బంది పట్టుకొని నేరుగా గోశాలకు తరలిస్తారని హెచ్చరించారు.

నవరాత్రి ఉత్సవాలకు పూర్తి ఏర్పాట్లు చేయాలి: డిప్యూటీ మేయర్

కార్పొరేషన్, సెప్టెంబర్ 3: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఎప్పటితరహాలోనే ఈ ఏడాది కూడా పూర్తి ఏర్పాట్లు చేయాలని నగర డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణీహరిశంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవరాత్రి ఉత్సవాలకు ముందు ఆయా ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతు పనులు పూర్తి చేయాలన్నారు. అలాగే తొమ్మిది రోజుల పాటుగా పారిశుధ్య పనులు చేపట్టాలని, వీధిదీపాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రోడ్లపైకి వచ్చిన చెట్ల కొమ్మలను తొలగించాలన్నారు. అలాగే నగరంలో ఎక్కడా కూడా పారిశుధ్య సమస్యలు రాకుండా చూడాలని కోరారు.

పదిమంది ఎస్ఐల బదిలీ

రాంనగర్, సెప్టెంబర్ 3: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో పదిమంది సబ్ ఇన్‌స్పెక్టర్లకు స్థాన చలనం కల్పిస్తూ సీపీ అభిషేక్ మొహంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు కరీంనగర్ త్రీ టౌన్‌కు, జమ్మికుంట ఎస్సై వివేక్ ఎల్ఎండీకి, కరీంనగర్ రూరల్‌లో పనిచేస్తున్న వీ శేఖర్ రామడుగుకు, రామడుగు ఎస్ఐ ఎం సురేందర్ కరీంనగర్ ట్రాఫిక్‌కు, పోలీస్ కంట్రోల్ రూంలో ఉన్న భాస్కర్‌రెడ్డి కరీంనగర్ వన్ టౌన్‌కు, సైదాపూర్ ఎస్ఐ ఆరోగ్యం జమ్మికుంటకు, వీఆర్‌లో ఉన్న సీహెచ్ తిరుపతి సైదాపూర్‌కు, టాస్క్‌ఫోర్స్‌లో ఉన్న లక్ష్మిరెడ్డి కరీంనగర్ రూరల్‌కు, సీసీఆర్‌బీలో ఉన్న రాజన్న కరీంనగర్ వన్ టౌన్‌కు, సిద్దిపేట స్పెషల్ బ్రాంచ్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి. నరేందర్‌రెడ్డి గంగాధరకు బదిలీపై రానున్నారు.

పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

జమ్మికుంట, సెప్టెంబర్ 3: పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, రోగాల్లేని పట్టణంగా జమ్మికుంటను తీర్చిదిద్దుకుందామని మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపల్ సమావేశ మందిరంలో ఆయన పరిసరాల శుభ్రతపై మెప్మా సభ్యులకు అవగాహన కల్పించారు. మంగళవారం డ్రై డే నిర్వహించాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. మేనేజర్ రాజిరెడ్డి, సీఎల్ఆర్పీలు జ్యోతి, మంజుల, ఆర్పీలు దేవేంద్ర, సునీత, రజిత, అబేదభాను, రజిత, మల్లీశ్వరి, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆర్బీఐ క్విజ్ ప్రోగ్రాం పోస్టర్ ఆవిష్కరణ

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 3 : ఆర్బీఐ క్విజ్ ప్రోగ్రాం–2024 పోస్టర్‌ను మంగళవారం కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై సత్యనారాయణ, ఆర్బీఐ లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ సాయి తేజ రెడ్డి, కరీంనగర్ లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు, అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టీ రాజయ్య, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ ఎం మల్లారెడ్డి, డాక్టర్ సుధాకర్, డాక్టర్ హర్జ్యోత్ కౌర్, రామకృష్ణ, డాక్టర్ అర్జున్, డాక్టర్ నరేశ్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ వేణు, శిరీష, అరవింద్, నర్మద, మల్లేశం పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం

శంకరపట్నం, సెప్టెంబర్ 3: వ్యక్తిగత పరిశుభ్రతతోనే బాలికల ఆరోగ్యం ముడిపడి ఉందని యూనిసెఫ్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ కిషన్‌స్వామి పేర్కొన్నారు. మంగళవారం కేశవపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలో 'స్వచ్ఛతా పక్వడా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో బాలికల కోసం మెన్‌స్ట్రువల్ ప్యాడ్ ఇన్‌సినరేటర్‌ను ఏర్పాటు చేశారు. దానిని వినియోగించే తీరుపై అవగాహన కల్పించారు. అలాగే 'క్యాచ్ ద రెయిన్'లో భాగంగా రూప్ టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ సోక్ పిట్ కోసం మార్క్‌ఔట్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కృష్ణప్రసాద్ స్కూల్‌లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ. 5 వేల నగదు ప్రోత్సాహకం ప్రకటించారు. బాలికలకు ఆరోగ్యవంతమైన అలవాట్లు, పరిశుభ్రత చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌బీఎం కో ఆర్డినేటర్ రమేశ్ అవగాహన కల్పించారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ రాఘవేందర్‌రెడ్డి, ఏపీవో శారద, హెచ్ఎం సుభాష్, టీఏ అంజయ్య, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్ఎండీ@ 16టీఎంసీలు

తిమ్మాపూర్, సెప్టెంబర్ 3: లోయర్ మానేరు డ్యాం 16టీఎంసీలకు చేరుకున్నది. ఇటీవల కురిసిన భారీవర్షాలకు వరద నీరు భారీగా వచ్చి చేరింది. మోయతుమ్మెద వాగు, ఇతర ప్రాంతాల నుంచి 6వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. 24టీఎంసీల సామర్థ్యం గల ఎల్ఎండీలో 16.263టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

వరద కాలువల నిర్మాణానికి కృషి

జమ్మికుంట, సెప్టెంబర్ 3: మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో వరద కాలువల నిర్మాణానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన జమ్మికుంటకు వచ్చారు. మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో పర్యటించారు. వరద నీటితో ఇబ్బంది పడుతున్న ప్రజలను కలిశారు. ప్రణవ్‌కు స్థానిక కాలనీవాసులు తమ ఇబ్బందులను తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి కాలనీలో మురుగు కాలువల సమస్యలున్నాయని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. ప్రణవ్ వెంట కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులున్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన అధికారులు

శంకరపట్నం, సెప్టెంబర్ 3: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని తహసీల్దార్ భాస్కర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ మంగళవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. కేజీబీవీలో పరిసరాల శుభ్రతను పరిశీలించినట్లు తెలిపారు. విద్యాలయంలో దాదాపు 50 మంది విద్యార్థినులు ఇండ్లకు వెళ్లినట్లు తెలిపారు. రికార్డులను తనిఖీ చేసినట్లు చెప్పారు. విద్యాలయ ఆవరణలో పరిసరాల శుభ్రతపై పలు సూచనలు చేశారు. ఇక్కడ ఎస్‌వో మాధవి, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

'ఉడకని భోజనం .. అపరిశుభ్ర వాతావరణం'

కేజీబీవీలో భోజనంలో నాణ్యత పాటించడం లేదని, ఉడకని అన్నం పెడుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మంగళవారం వారు తహసీల్దార్‌తో కలిసి కేజీబీవీని సందర్శించారు. అనంతరం విద్యాలయం ఎదుట విలేకరులతో మాట్లాడారు. పారిశుధ్య లోపంతో పలువురు విద్యార్థినులు జ్వరాల బారిన పడుతున్నారని, ఈ మేరకు వారి తల్లిదండ్రుల ద్వారా తమకు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. అలాగే, విద్యాలయంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొన్నదని చెప్పారు. ఇక్కడ కాంగ్రెస్ యూత్ నాయకులు హిసామొద్దీన్, గొడిశాల ప్రవీణ్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

మట్టి గణపతిని పూజిద్దాం

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 3 : ప్రతి ఒక్కరూ మట్టి గణపతి పూజించి, పర్యావరణాన్ని కాపాడుకుందాం అని ఉమా పుత్ర ఉత్సవ కమిటీ చైర్మన్ కోట సతీశ్‌కుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని విద్యానగర్, ప్యారిస్ లేన్‌లో మంగళవారం ఉమాపుత్ర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనంతరం ఉత్సవ కమిటీ లోగో, గణపతి నవరాత్రి ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో కమిటీ సభ్యులు రవి కుమార్, రాజు, వెంకన్న, సందీప్, సదానందం, రాములు, శ్రీనివాస్ రావు, సాయి, ఆనందరావు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో నర్సింగ్ ఆఫీసర్ ఆత్మహత్య

విద్యానగర్, సెప్టెంబర్ 3: కరీంనగర్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో పని చేస్తున్న నర్సింగ్ ఆఫీసర్ పంతం అనూష (28) అనారోగ్యంతో బాధపడుతూ ఆత్మహత్య చేసుకుంది. శనిగరం గ్రామానికి చెందిన అనూషకు రెండు సంవత్సరాల బాబు ఉన్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, సోమవారం పురుగుల మందు తాగగా, కుటుంబ సభ్యులు చికిత్స కోసం హాస్పిటల్‌లో చేర్పించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. వైద్యాధికారులు ఇన్‌చార్జి ఆర్ఎంవో డాక్టర్ నవీన, ఏడీ షమీం, ఆఫీస్ సూపరింటెండెంట్ జైశ్రీమన్నారాయణ, సీనియర్ అసిస్టెంట్ సర్దార్, సిబ్బంది.. అనూష మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ప్రభుత్వపరంగా తక్షణ సాయంగా రూ.20 వేలను కుటుంబ సభ్యులకు అందించారు.

చెరువు కాదు.. వాకిలే!

నవాబుపేటలో ఇండ్ల ముందు నిలిచిన వర్షపు నీరు

చిగురుమామిడి, సెప్టెంబర్ 3: నాలుగైదు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు నవాబ్ పేట్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల వెనుక నీరు చేరడంతో ఆయా కాలనీకి చెందిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇనుకొండ భూమిరెడ్డి, కాశివేణి రాజయ్య, నాంపల్లి కొమురయ్య, మర్రి బాలయ్య ఇండ్ల ముందు నీరు నిలిచి ఉండడంతో బయటికి వెళ్లలేని పరిస్థితి నెలకొన్నదని వారు ఆవేదన చెందుతున్నారు. అధికారులు వెంటనే చర్యలు చేపట్టారని కోరుతున్నారు.

ఎమ్మెల్యేలపై దాడి చేయడం సిగ్గుచేటు

వీణవంక, సెప్టెంబర్ 3: ప్రజలకు అండగా నిలిచిన బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలపై దాడి చేయడం సిగ్గుచేటని తన్నీరు హరీశ్‌రావు టీం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు అప్పని హరీశ్‌వర్మ పేర్కొన్నారు. అకాల వర్షానికి ఖమ్మం జిల్లా అతలాకుతలం కాగా, ప్రజలకు అండగా నిలిచేందుకు వెళ్లిన బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఓదార్చాల్సిన పరిస్థితుల్లో ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీని హెచ్చరించారు. దాడికి పాల్పడిన దుండగులపై తగిన చర్యలు తీసుకోవాలని, ఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు.

'ప్రజల సౌకర్యం కోసమే వంతెన ప్రారంభానికి ఒప్పుకొన్నం'

రామడుగు, సెప్టెంబర్ 3: మండల ప్రజల సౌకర్యం కోసమే కొత్త వంతెన అందుబాటులోకి తెచ్చేందుకు అంగీకరించినట్టు భూ నిర్వాసితులు కడారి వీరయ్య, మొగిలి కనకయ్య పేర్కొన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, రామడుగు వాగుపై పాత వంతెన పూర్తిస్థాయిలో దెబ్బతినడంతో ప్రజల బాధలను తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, వంతెనకు ఇరువైపులా భూమిని కోల్పోతున్న తమ దగ్గరకు వచ్చి మాట్లాడి, కలెక్టర్ వద్దకు తీసుకెళ్లారన్నారు. వారం పదిరోజుల్లో పరిహారం అందే ఏర్పాట్లు చేస్తామని, ప్రస్తుతం ప్రజలకు ప్రయాణ సౌకర్యం కల్పించేలా సహకరించాలని కోరినట్లు తెలిపారు. దీనిపై కొందరు లేనిపోనివి ప్రచారం చేస్తున్నారని, కేవలం మానవతా దృక్పథంతో ప్రజలకు ఇబ్బంది కలుగకూడదనే ఆలోచనతోనే కొత్త వంతెనను ప్రారంభించేందుకు ఒప్పుకొన్నామని తెలిపారు.

అధికారులకు బీఆర్ఎస్ నేతల సన్మానం

హుజూరాబాద్ టౌన్, సెప్టెంబర్ 3: బదిలీపై పట్టణానికి వచ్చిన సీఐ జి. తిరుమల్, తహసీల్దార్ కే కనకయ్యను మంగళవారం బీఆర్ఎస్ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్లు ముక్క రమేశ్, పాల కిషన్